క్లుప్తంగా

రొటేరియన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



తెనాలి: అన్నదాత సుఖీభవ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బోసురోడ్డులో ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రంలో మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు. రోటేరియన్ ఆలపాటి కిరణ్ జన్మదినోత్సవ సందర్భంగా ఈ వితరణ చేశారు. సీనియర్ రొటేరియన్ కన్నెగంటి మురళీకృష్ణ, పావులూరి రాంబాబు, ఆలపాటి కిరణ్, వీరవల్లి శ్రీధర్, కొమ్మలపాటి ఆంజనేయులు, జాన్ కీట్స్, బద్రి గిరి, జీవీ నారాయణ, ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు, శికినం వరప్రతాప్ కుమార్, గుడికందుల అర్జున్ రావు, దూళిపూడి శ్రీరామ్మూర్తి, డాక్టర్ ఉమ్మలనేని శ్రీనివాసరావు, అంగిరేకుల శివ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణకు సహకరించాలి



తెనాలిటౌన్: పట్టణ సుందరీకరణలో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. చెంచుపేట, బాలాజీరావు, బోసురోడ్డు, తదితర ప్రాంతాల్లో పర్యటించి శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు చెత్తను రోడ్లపై, కాల్వల్లో వేయవద్దని విజ్ఞప్తి చేశారు. శానిటేషన్ సిబ్బంది పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని ఆదేశించారు. శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై సమీకృత పశువుల దాణా పంపిణీ



తెనాలి: రాష్ట్రప్రభుత్వ సమీకృత పశువుల దాణా పథకాన్ని రూరల్ మండల గ్రామం అంగలకుదురులో ప్రారంభించారు. గ్రామంలోని పశువైద్యశాలలో పశు పోషకులకు 50 శాతం రాయితీపై పశువుల సమీకృత దాణాను పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రాథమికంగా ఒక్కో పాడిరైతుకు 50 కిలోల దాణాను అందజేశారు. దాణా అసలు ధర రూ.1110 కాగా, 50 శాతం సబ్సిడీపై రూ.555లకు రైతులకు పంపిణీ చేశారు. తెనాలి రూరల్ మండలానికి 25 మెట్రిక్ టన్నులు మంజూరు కాగా, అంగలకుదురు, కొలకలూరు, గుడివాడ, పెదరావూరు, తెనాలి పశువైద్యశాలలకు ఒక్కోదానికి 5 మెట్రిక్ టన్నుల చొప్పున కేటాయించినట్టు వివరించారు. గ్రామ సర్పంచ్ ఊసరవు లక్ష్మి, ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, వీరవల్లి మురళి, పశువైద్యురాలు డాక్టర్ సీహెచ్ అనూష, సంగంజాగర్లమూడి కాంపౌండర్ ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

బడి బాట ప్రచారం



చుండూరు(వేమూరు): బడిఈడు, బడి మానేసిన బాలలందరూ ఈ విద్యా సంవత్సరంలో వంద శాతం నమోదు కావాలని బడిబాట ప్రచారకర్త బట్టు వెంకయ్య అన్నారు. చుండూరు మండలంలోని నడ్డిగడ్డ పాలెం ఎస్టీ కాలనీలో అక్షర కోలాటం ద్వారా బడిబాట ప్రచారం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5–14 వయస్సు ఉన్న ఎస్టీ పిల్లలందరూ విద్య నభ్యసించాలని, బడిఈడు, బడి మానేసిన పిల్లలను 100 శాతం బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు పిల్లలను బాడిబాట పట్టించాలని ఆయన కోరారు. తల్లికి వందనం పథకం జూన్‌లో పొందొచ్చన్నారు. కుల వృత్తులకు పిల్లలను తీసుకెళ్లవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

1న జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

రేపల్లె: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీన ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు, రాష్ట్రస్థాయి సెలక్షన్‌లు నిర్వహించబడునని జిల్లా తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ కె.జగన్‌మోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో గెలుపొందిన వారిని జూన్ 9, 10, 11 తేదీలలో అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. పోటీలలో పాల్గొనే తైక్వాండో క్రీడాకారులు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ ఫొటో, జనన ధ్రువీకరణ పత్రంతో 1వ తేదీ ఉదయం 8 గంటలకు హాజరుకావాలన్నారు.

మహాప్రభో.. కుక్కల సమస్య పరిష్కరించండి

- పలువురు కౌన్సిలర్ల వినతి
- సమస్యలపై నిలదీసిన కౌన్సిలర్లు



అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ రాధిక



వార్డు సమస్యలపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ సుజాత



వీధి కుక్కలపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ కోటయ్య

తెనాలిఅర్బన్: 'పట్టణంలో కుక్కల సమస్య ఎక్కువగా ఉంది.. ఇటీవల 25వ వార్డులో అయిదు దూడలపై కుక్కలు దాడులు చేశాయి... వాటి వల్ల ప్రజలకు, పశువులకు ఇబ్బందులు వస్తున్నాయి.. వీటి నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలి' అని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, తాడిబోయిన రామయ్య, జనసేన పార్టీ కౌన్సిలర్ గోగిరెడ్డి మానస రెడ్డిలు కోరారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహించారు. కుక్కల సమస్యను పరిష్కరించే కార్యక్రమంలో భాగంగా వాటిని పట్టుకుని శస్త్రచికిత్సలు చేయించడం జరుగుతుందని కమిషనర్ బండి శేషన్న వివరణ ఇచ్చారు. దీనిపై సంతృప్తి చెందని కౌన్సిలర్ రామయ్య 'ఇలా ఎప్పుడో ఒకసారి కుక్కలను పట్టడం వల్ల ప్రయోజనం ఉండదని, వైద్యుల సంఖ్యను పెంచి రోజుకు 25 నుంచి 30 కుక్కలకు శస్త్రచికిత్సలు చేసేలా చర్యలు తీసుకోవాలని' కోరారు. 'త్వరలో వైద్యుల సంఖ్యను పెంచుతామని' కమిషనర్ ప్రకటించారు.

వర్షపు నీటితో ఇక్కట్లు

చినరావూరుకు వెళ్లే ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఆ రోడ్డును ఎందుకు వేయడం లేదని 13వ వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాత ప్రశ్నించారు. 200 మీటర్ల రోడ్డును మూడు ముక్కలు చేసి వేస్తున్నారని ఇది ఎంత వరకు పద్ధతని ప్రశ్నించారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రోడ్డు వేసేందుకు కాంట్రాక్టర్లు దానిని వేసేందుకు ముందుకు రావటం లేదని, అందువల్ల మూడు ముక్కలుగా చేసి టెండర్లు పిలిచినట్లు ఎంఈ ఆకుల శ్రీనివాసరావు తెలిపారు. పనులు సోమవారం ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వేర్వేరు సమస్యలపై....

సచివాలయ సీలింగ్ ఊడిపోయి సంవత్సరం దాటుతున్నా నేటికీ దానిని బాగు చేయించలేదని, కమ్యూనిటీ హాల్‌లోని భోజన శాలను అసంపూర్తిగా వదిలేశారని వాటిని పూర్తి చేయాలని కౌన్సిలర్ సుజాత కోరారు. చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. పట్టణంలో మంజూరైన అనేక రోడ్లు, కాల్వలను నెలలు దాటుతున్నా కాంట్రాక్టర్‌లు వేయడం లేదని టీడీపీ కౌన్సిలర్లు అడుసుమల్లి వెంకటేశ్వరరావు, పసుపులేటి త్రిమూర్తి ఆరోపించారు.

పనులు ప్రారంభించని వారికే ఎందుకు మళ్లీ కాంట్రాక్టులు ఇస్తున్నారని ప్రశ్నించారు. వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సూచించారు. బిల్లుల చెల్లింపులో జాప్యం వల్ల పనులను కాంట్రాక్టర్లు ప్రారంభించటం లేదని, ఇప్పుడు బిల్లుల చెల్లింపులు ప్రారంభం కానున్నాయని అన్ని పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలు ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించి సమావేశాన్ని ముగించారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి రావు, మేనేజర్ విల్సన్ జయకర్, ఏసీపీలు శివన్నారాయణ, వాణి, ఆర్‌వో రాంప్రసాద్, పలువురు కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

యోగాసనాలతో మానసిక ఉల్లాసం

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ శేషన్న

తెనాలిటౌన్: యోగాసనాలతో ఆరోగ్యం మెరుగుపడటమేకాక మనస్సుకు మానసిక ఉల్లాసం పెంపొందుతుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో నిర్వహిస్తున్న యోగా మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రం, చెంచుపేటలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పాల్గొని మాట్లాడారు. ఈ నెల 21వ తేదీ నుంచి జూన్ 21 వరకు అన్ని పట్టణాల్లో రాష్ట్ర వ్యాప్తంగా యోగా మాసోత్సవాలు జరుగుతున్నట్లు తెలియజేశారు. దీనిలో భాగంగానే పట్టణంలో యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

యోగాసనాలు మనిషి ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని వివరించారు. ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న యోగా శిక్షణ కార్యక్రమాలు బుధవారం నుంచి చెంచుపేటలోని ఎస్ఎల్ఎస్ కళ్యాణ మండపానికి మార్పు చేస్తున్నట్లు చెప్పారు. సీఎం కాలనీ, పినపాడు, పాండు రంగపేట, మాదాలవారి వీధి, బాలాజీరావుపేట, సుల్తానాబాద్, ఉడాకాలనీ, తదితర ప్రజానీకం శిక్షణ శిబిరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి రావు, ఆర్‌వో రాంప్రసాద్, పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పశువులకు 50 శాతం సబ్సిడీపై దాణా పంపిణీ

వేమూరు: వేసవి కాలంలో పశువులకు మేత కొరత ఉండటం వల్ల ప్రభుత్వం సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ చేయడం జరుగుతుందని వెటర్నరీ ఏడీ జనార్ధన్ తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం 50 శాతం సబ్సిడీపై దాణాను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. రైతులందరు పశువులకు 50 శాతం సబ్సిడీపై అందిస్తున్న దాణాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జొన్నలగడ్డ విజయబాబు, రైతులు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయుడికి విశేష పూజలు



మన్యుసూక్త హోమంలో పాల్గొన్న భక్తులు

తెనాలి: స్థానిక షరాఫ్ బజార్ లో వేంచేసి ఉన్న శ్రీ సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక శ్రీహనుమత్ జయంతి మహోత్సవాలు, 17వ లక్ష శ్రీహనుమాన్ చాలీసా పారాయణ కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారికి విశేష పూజలు, మన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 1108 అరటి పండ్లతో విశేష పూజాది కార్యక్రమాల్లో నిర్వహించారు.180 మంది భక్తులు 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయ వంశపారంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైఖానస పండితులు నాగ మారుతి బృందం ఆగమోక్తంగా కార్యక్రమాలను జరిపారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 11 రోజులు పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజు విశేష పూజలు, హోమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. అర్చకులు కిరణ్ కుమార్, సురేష్, కౌన్సిలర్ పి.త్రిమూర్తి, దాతలు కారంశెట్టి అమర్‌నాథ్, తాతా శ్రీనివాసరావు, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, ట్రస్టు సభ్యులు గుడివాడ బాలకృష్ణ, మూర్తి వెంకటేశ్వరరావు, ముదుపల్లి చంద్రశేఖర్, జంధ్యం రామారావు, గాజుల రాజేంద్రప్రసాద్, మాజేటి వెంకటేష్, మద్దు హరీష్, బచ్చు లీలాప్రసాద్, వెచ్చ కృష్ణకిషోర్, గొర్తి సోమ శేఖర్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

2న పేదల ఇళ్ల స్థలాల కోసం ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్, సీపీఐ నేతలు

లక్ష్మీపురం: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ జూన్ 2న తాలూకా కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం పేదలకు ఇచ్చి ఇళ్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో 2 సెంట్లు స్థలం ఇస్తే, ఆ సమయంలో ఇది చాలా అన్యాయం అని చంద్రబాబు విమర్శించారని గుర్తు చేశారు. ఈ స్థలం ఇంటికి సరిపోదని ప్రతిచోట జరిగిన సమావేశాల్లో చెప్పిన చంద్రబాబు, తాము అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు ఇచ్చి, గ్రామాల్లో మూడు సెంట్లు ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి రూ.4 లక్షలు ఇస్తామని ఎన్నికల్లో ప్రచారం చేశారన్నారు.

తెనాలిలో పోలీసులు ప్రవర్తన దారుణంగా ఉందన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ గుంటూరు నగరంలో అర్హులైన పేద ప్రజలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడ హనుమంతరావు మాట్లాడారు.. అనంతరం 2న జరిగే ధర్నా పోస్టర్లు ఆవిష్కరించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అరుణ్ కుమార్, షేక్ వలి, సమితి సభ్యులు జంగాల చైతన్య పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ల జీవితాలతో చెలగాటం



మంగళగిరి తహసీల్దార్ దినేష్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు

మంగళగిరి టౌన్: కూటమి ప్రభుత్వం తమ జీవితాలతో చెలగాటమాడుతోందని ఎండీయూ వాహనాలకు కాలపరిమితి ఉన్నా ఇంటింటికి రేషన్ అందించే వ్యవస్థను రద్దు చేయడం దారుణమని పలువురు ఎండీయూ వాహన డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం అసోసియేషన్ సభ్యులంతా మంగళగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మంగళగిరి వడ్లపూడి సెంటర్ నుంచి గౌతమ బుద్ధ రోడ్‌మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ఎండీయూ వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. గౌతమ బుద్ధ రోడ్‌పై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఎండీయూ ఆపరేటర్లు మాట్లాడుతూ 2027 జనవరి వరకు అగ్రిమెంట్లు ఉన్నప్పటికీ వాటిని రద్దు చేసి కక్షసాధింపు చర్యలకు ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. 2021లో కరోనా వంటి ఉపద్రవంలో కూడా తమ జీవితాలను పణంగా పెట్టి ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా విధులు నిర్వహించి ప్రజలకు రేషన్ అందించామని అన్నారు. ఎండీయూ వ్యవస్థ రద్దు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ దినేస్ చంద్రకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎంటీఎంసీ ఎండీయూ యూనియన్ అధ్యక్షుడు విజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు రవికుమార్, సెక్రటరి వి.రవికుమార్, పలువురు ఎండీయూ వాహన డ్రైవర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

కల్వర్ట్‌ల పూడికతీత వేగవంతం చేయాలి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



చిట్టి ఆంజనేయస్వామి గుడి సెంటర్‌లో పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిటౌన్: పట్టణంలోని కల్వర్ట్‌ల వద్ద పేరుకుపోయిన మురుగు, చెత్త, చెదారం పూడికతీత పనులు వేగవంతం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. మంగళవారం పట్టణంలో నిర్వహిస్తున్న కల్వర్ట్‌ల పూడికతీత ప్రత్యేక డ్రైవ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక బోసు రోడ్డులోని చిట్టి ఆంజనేయస్వామి గుడివద్ద జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. ప్రజలు కాల్వల్లో చెత్త చెదారం వేయడం వలన భారీగా మురుగు పేరుకుపోయి నీటిపారుదల జరగకపోవడంతో పలు ప్రాంతాల్లో దుర్వాసన వస్తుందని వెల్లడించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కాల్వల్లో చెత్తచెదారం వేయవద్దని సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది పట్టణ ప్రజలను ఈ విషయంపై చైతన్యపరచాలని ఆదేశించారు. ప్రజలకు ఎక్కడ అసౌకర్యం కలుగకుండా మురుగు, చెత్త చెదారాన్ని ప్రొక్లెయిన్‌తో తీసివేస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

నాటు సారా తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ బాపట్ల జిల్లా సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

రేపల్లె: నాటు సారా తయారు చేసినా, విక్రయాలు జరిపినా చట్టరీత్యా నేరమని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ బాపట్ల జిల్లా సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుడ్డికాయ లంక పంచాయతీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటు సారా తాగితే జీవితాలు దుర్భరమవుతాయన్నారు. నాటుసారా ఆరోగ్యాన్ని పాడు చేస్తుందని చెప్పారు. నాటు సారా తయారీని పూర్తిగా నివారించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గుడ్డికాయలంకను నాటు సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తుల సహకారం ఎంతో అవసరం అన్నారు. అనుమానిత గ్రామాలలో తమ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని, చట్టా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటు సారా తయారీ, క్రయ వికయాలపై గ్రామస్తులు తమకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచడంతోపాటు నగదు బహుమతులను అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా నాటు సారాను గ్రామం నుంచి పూర్తిగా బహిష్కరిస్తామంటూ గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ దివాకర్, ఎస్ఐ రాజశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలుగు పంచకావ్యాలలో మొదటిది శృంగార నైషథం



మాట్లాడుతున్న శ్రీరంగనాయకి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మంగళవారం భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో శృంగార నైషధంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఆధ్యాత్మిక ప్రవచకురాలు డాక్టర్ కోగంటి వేంకటశ్రీరంగనాయకి ప్రవచిస్తూ శ్రీనాథుని శృంగార నైషధం తెలుగు పంచకావ్యాలలో మొదటిదన్నారు. ఇది నల, దమయంతిల ప్రేమకథను వర్ణిస్తుందని చెప్పారు.

నలరాజు, దమయంతిని వివాహం చేసుకున్నాక వారు కలిసే కథ అని అన్నారు. ఈ కథను శ్రీహర్షుడు సంస్కృతంలో నైషధ మహాకావ్యంగా రాశాడని పేర్కొన్నారు. శ్రీనాథుడు దాన్ని తెలుగులోకి అనువదించారని, శృంగార నైషథం నల, దమయంతిల ప్రేమను వారి జీవితంలోని వివిధ సంఘటనలను అందంగా వర్ణిస్తుందని అన్నారు. కథలో నలరాజు, దమయంతి నరక యాత్రా కష్టాలను ఎలా ఎదుర్కొన్నారు, వారు ఒకరికి ఒకరూ ఎలా మళ్లీ కలిశారనేది తెలియజేస్తుందని అన్నారు.

గిరి ప్రదక్షణకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసు

పట్నంబజారు: శివ భక్తుల కోసం పవిత్ర అరుణాచలంలో జరిగే పౌర్ణమి గిరి ప్రదక్షణకు సంబంధించి ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ మంగళవారం తెలిపారు. జూన్ 11న పౌర్ణమి పురస్కరించుకుని అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షణ కు జూన్ 9వ తేదీ రాత్రి 9.15 గంటలకు బస్సు బయల్దేరుతుందని చెప్పారు. 10వ తేదీ గోల్డెన్ టెంపుల్, కాణిపాకం, శ్రీకాళహస్తి దర్శించుకుని అదే రోజు రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. 11వ తేదీ గిరిప్రదక్షణ, స్వామి దర్శనం పూర్తయిన తరువాత అదేరోజు రాత్రి బయల్దేరి 12వ తేదీ ఉదయం గుంటూరు చేరుకుంటుందని వివరించారు. ఈ సర్వీసుకు సంబంధించి 96164 నంబరు ద్వారా ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవాలని కోరారు. ఒక టికెటు ధర రూ. 2,420 నిర్ణయించినట్లు తెలిపారు. వివరాల కోసం 7382897459లో సంప్రదించాలని సూచించారు.

బాలికల పట్ల వివక్ష వీడాలి

సీడీపీవో అనసూయ



బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో అనసూయ

నిజాంపట్నం: బాలికల పట్ల లింగ వివక్షను వీడాలని, బాలికలను అన్నిరంగాలలో అభివృద్ధి చెందే విధంగా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సీడీపీవో అనసూయ అన్నారు. మండలంలోని కొత్తపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు మంగళవారం పలు అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. లింగ వివక్ష చూపే వారు చట్టరీత్యా నేరస్తులన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తమ పరిధిలో ఎవరైనా బాల్యవివాహాలు జరిపినట్లు తెలిస్తే అధికారులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలు అధికంగా ఉన్నాయని, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధికి మాత్రమే ఉపయోగించాలని, తమ వ్యక్తిగత సమాచారంను ఎవరితోనూ పంచుకోరాదని సూచించారు. కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, అనారోగ్య సమస్యలు తలెత్తితే తల్లిదండ్రులకు గాని, ఉపాధ్యాయులకు గాని తెలియజేయాలని సూచించారు. అనంతరం బాలికల కోసం ప్రభుత్వం చేసిన పలు చట్టాలను వివరించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి శైలజ, సూపర్‌వైజర్ స్వరూపరాణి, అంగన్‌వాడీలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ దుష్ట యత్నాలు తిప్పి కొట్టాలి

మంగళగిరి టౌన్: మత రాజకీయాలు చేస్తున్న బీజేపీ దుష్ట పన్నాగాలను ప్రజలంతా సంఘటితంగా తిప్పి కొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని అంబేడ్కర్ సెంటర్‌లో పలు పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమైక్యత సభ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పెహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడులను దేశవ్యాప్తంగా వామపక్షాలు, లౌకిక పార్టీలు, కాంగ్రెస్ పార్టీ ఖండించడం జరిగిందన్నారు. నిఘా వర్గాలకు ఉగ్రవాదుల చర్యలు ముందే తెలిసి హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం తగు చర్యలు తీసుకోలేదన్నారు. ముస్లింలు అంటేనే ఉగ్రవాదులని బీజేపీ దాని అనుబంధ పరివార సంఘాలు మాట్లాడడం సబబు కాదన్నారు. మణిపూర్‌లో 250 మంది హత్యలు, అత్యాచారాలకు గురైన ఘటనలు ఉన్నాయని, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఇంతవరకు ఆ ప్రాంతాన్ని సందర్శించలేదని విమర్శించారు. సంఘ్ పరివార్ శక్తులు దేశాన్ని మతాల వారీగా విభజించడానికి ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.